

లక్ష్యానికి మించి ఉపాధి కల్పన: కలెక్టర్

అనకాపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 120 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 124.67 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీలు రూ.350 కోట్ల వేతనాలు పొందారని, రోజువారీ సగటు వేతనం రూ.281 అందడం ద్వారా రాష్ట్రంలో నాలుగో స్థానంలో జిల్లా నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం సిబ్బందిని అభినందించారు.

ఇంకా పరాయి పంచనే!

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి నేటికి మూడేళ్లు పూర్తి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి ముచ్చటగా మూడేళ్లు అయ్యింది. జిల్లాలను పునర్విభజన చేసిన వైసీపీ రెండేళ్లకుపైగా అధికారంలో వుంది. కానీ ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించలేదు. జిల్లా పరిపాలనకు కేంద్ర స్థానమైన కలెక్టరేట్‌తోపాటు శాంతి భద్రతలను పరిరక్షించే జిల్లా పోలీసు కార్యాలయానికి సొంత గూడు ఒనగూరలేదు. వీటికి భవనాల నిర్మాణం కోసం కనీసం భూమిని కూడా గుర్తించలేదు. జిల్లాల పునర్విభజన సమయంలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రతి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మిస్తామని నాటి వైసీపీ పాలకులు ఆర్భాటంగా చేసిన ప్రకటనలు నీటి మూటలుగా మారాయి. కొత్త జిల్లా ఏర్పడి మూడేళ్లు అవుతున్న సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సంబంధించి అప్పటి పరిస్థితి, ప్రస్తుత పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- తొలగని బాలారిష్టాలు
- సొంత గూటికి నోచుకోని కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం
- పలు ప్రభుత్వ శాఖలదీ అదే పరిస్థితి
- చాలీచాలని అద్దె భవనాలతో ఉద్యోగుల ఇక్కట్లు
- నాడు హడావిడిగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న వైసీపీ ప్రభుత్వం
- కార్యరూపం దాల్చని 'ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్' హామీ



అనకాపల్లి మండలం శంకరం పంచాయతీ పరిధిలోని ఒక ప్రైవేటు కళాశాల భవనంలో కొనసాగుతున్న కలెక్టర్ కార్యాలయం

జిల్లాలో 40కి పైగా వివిధ ప్రభుత్వ శాఖల జిల్లాస్థాయి కార్యాలయాలు వున్నాయి. వీటిలో కేవలం 11 శాఖలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన కార్యాలయాలు గతంలో వున్న మండల/ డివిజన్‌స్థాయి కార్యాలయాల్లో, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మొత్తం మీద నాలుగింట మూడొంతుల కార్యాలయాలు పరాయి పంచన నడుస్తున్నాయి. ప్రధానంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీసు (ఎస్పీ) కార్యాలయం అద్దెకు తీసుకున్న ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేశారు. మూడేళ్లు గడిచినా సొంత గూడుకు నోచుకోలేదు. కలెక్టర్ కార్యాలయం నిర్వహిస్తున్న అనకాపల్లి మండలం శంకరం పంచాయతీ పరిధిలోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు నెలకు రూ.3 లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఎస్పీ కార్యాలయాన్ని మరో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయాన్ని అనకాపల్లి మండల విద్యా శాఖ కార్యాలయంలో నడుపుతున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయాన్ని కూడా ఇందులోనే ఏర్పాటు చేయడంతో ఇరుకుగా వుండి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బీసీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయాన్ని అనకాపల్లిలోని ఒక అపార్టుమెంట్ సెల్లారులో ఏర్పాటు చేశారు. జిల్లా ఖజానా కార్యాలయం మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఒక షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాన్ని శంకరంలోని సామాజిక భవనంలో, జిల్లా దేవదాయ శాఖ కార్యాలయం, గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయం. వాణిజ్య పన్నుల అధికారి, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలను అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను అద్దెకు తీసుకుని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయాన్ని మండల వ్యవసాయాధికారి కార్యాలయ గోదాములో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న వివిధ కార్యాలయాలకు నెలకు సుమారు రూ.50 లక్షలు అద్దె రూపంలో ప్రభుత్వం చెల్లిస్తున్నది. కాగా జిల్లా కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ (నివాసం) కోసం ఏపీఐఐసీ కోడూరులో నిర్మించిన భవనాన్ని కేటాయించారు. జాయింట్ కలెక్టర్ ప్రస్తుతం సబ్బవరంలోని ఒక ప్రైవేటు భవనంలో అద్దెకు ఉంటున్నారు.



పట్టణంలోని ఒక అపార్టుమెంట్ సెల్లార్‌లో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కార్యాలయం



నివాస భవన సముదాయం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

పట్టణానికి దూరంగా కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్

కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాలను ప్రధాన రహదారికి దూరంగా, అనకాపల్లి పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో నిత్య విధులకు హాజరయ్యే ఉద్యోగులతోపాటు వివిధ పనుల నిమిత్తం ఈ రెండు కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ నుంచి అప్పట్లో పలువురు ఉద్యోగులను అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి పంపారు. పిల్లల చదువులు, కొంతమందికి సొంత ఇళ్లు వుండడంతో రోజూ విశాఖ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై కొప్పాక వద్ద బస్సు దిగి, ప్రత్యేకంగా ఆటో మాట్లాడుకుని కలెక్టరేట్‌కు చేరుకోవాలి. లేదంటే అనకాపల్లి పట్టణంలోకి వెళ్లి, అక్కడి నుంచి సబ్బవరం వైపు వెళ్లే సర్వీసు ఆటోలను ఆశ్రయించాలి. అనకాపల్లి- సబ్బవరం ప్రధాన రహదారిలో దిగి, సుమారు కిలోమీటరు దూరం నడుచుకుంటూ కలెక్టరేట్‌కు వెళ్లాలి. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి కలెక్టరేట్‌కు షటిల్ బస్సు సర్వీసులను ... మిగతా 8వ పేజీలో

మందుబాబులపై డ్రోన్ పడగ!

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని పట్టుకోవడానికి పోలీసు శాఖ వినియోగం

- వెదురుపర్తిలో నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పేకాట, కోడిపందేల శిబిరాలు డ్రోన్‌తో గుర్తింపు



పోలీసులు వెళ్లకముందు మందు బాబులను గుర్తించిన డ్రోన్ చిత్రం



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ప్రదేశానికి చేరుకున్న పోలీసు వాహనం

అచ్యుతాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు 'డ్రోన్' పాదం మోపుతున్నారు. డ్రోన్ల సాయంతో ఏజెన్సీలో గంజాయి సాగును గుర్తిస్తున్నట్టుగానే ఇక నుంచి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని, పేకాట, కోడిపందేలు వంటి జూదాలు ఆడేవారిని గుర్తించి పట్టుకోవడానికి డ్రోన్లను వాడుతున్నారు. గురువారం మండలంలోని వెదురుపర్తి పంచాయతీ పరిధిలో వున్న ఇళ్ల స్థలాల లేవుట్లలో మద్యం సేవిస్తున్న నలుగురిని డ్రోన్ సాయంతో గుర్తించారు. అనంతరం పోలీసులు వాహనంలో అక్కడకు వెళ్లి మందు బాబులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నమ్మి గణేశ్ మాట్లాడుతూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని డ్రోన్ సహాయంతో పట్టుకొంటున్నామని తెలిపారు. ఇకపై ప్రతి రోజు ఇదే విధంగా డ్రోన్‌లతో గస్తీ నిర్వహిస్తామన్నారు. రాత్రి వేళ కూడా స్పష్టంగా కనిపించే కెమెరాలు వున్న డ్రోన్లను వినియోగిస్తున్నామని సీఐ తెలిపారు.

నర్సీపట్నం ఆస్పత్రికి అధునాతన అంబులెన్స్

- సీఎస్ఆర్ కింద రూ.35 లక్షలు ఇచ్చిన ఎన్టీపీసీ

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి ఆసుపత్రికి అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ కొనుగోలు కోసం ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.35 లక్షలు కేటాయించారు. ఈ మేరకు చెక్కును ఎన్టీపీసీ సింహాద్రి ఈడీ సమీర్‌శర్మ గురువారం కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఆమె చాంబర్‌లో కలిసి అందజేశారు. సామాజిక బాధ్యత కింద అంబులెన్స్ కొనుగోలుకు నిధులు ఇవ్వడం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ సింహాద్రి ప్రతినిధులు ప్రసేన్జిత్ పాల్, టీటీ పాత్ర, కె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ విజయకృష్ణన్‌కు రూ.35 లక్షల చెక్కును అందజేస్తున్న ఎన్టీపీసీ సింహాద్రి ఈడీ సమీర్‌శర్మ, అధికారులు

దర్జాగా ఇసుక దోపిడీ

లక్కవరం వద్ద శారదా నదిలో అక్రమ తవ్వకాలు

- రేయింబవళ్లు లారీలు, ట్రాక్టర్లతో విశాఖకు తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- అక్రమ ఇసుక తవ్వకాలతో.. ప్రభుత్వ డిపోలో మందకొడిగా అమ్మకాలు

చోడవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన ఇసుకను తక్కువ ధరకు అందరికీ అందుబాటులోకి తెచ్చినప్పటికీ నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. సొంత అవసరాల కోసం సమీపంలోని నదులు, గెడ్డల్లో నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును కొంతమంది వ్యక్తులు వ్యాపారంగా మార్చుకున్నారు. చోడవరం మండలంలోని నదుల్లో ఇసుక తవ్వి, ట్రాక్టర్ల ద్వారా ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలో వున్న విశాఖపట్నం తరలిస్తున్నారు. మధ్యలో ఒక్కచోట కూడా ఆయా మండలాల అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు. చోడవరం మండలం లక్కవరం పంచాయతీ పరిధిలోని శారదా నదిలో కొద్దిరోజులుగా విశాఖ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వించి లారీలు, ట్రాక్టర్లతో దర్జాగా తరలించుకుపోతున్నారు. రెవెన్యూ అధికారులుగానీ, పోలీసులుగానీ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. లక్కవరంతోపాటు పక్కనే వున్న కె.కోటపాడు మండలం చౌడువాడ సరిహద్దుల్లో కొద్దిరోజుల నుంచి పగలు, రాత్రి అన్న తేడాలేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. తాము అభ్యంతరం చెప్పినప్పటికీ ఖాతరు చేయకపోవడంతో బుధవారం 16 ట్రాక్టర్లను పట్టుకుని, రెవెన్యూ సిబ్బందికి అప్పగించామని, కానీ కొంతసేపటి తరువాత విడిచిపెట్టేశారని వారు ఆరోపిస్తున్నారు.



లక్కవరం వద్ద శారదా నదిలో నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



ముద్దుర్తి జంక్షన్ వద్ద ప్రభుత్వ డిపోలో ఇసుక నిల్వలు

ప్రభుత్వ ఇసుక డిపోలో అరకొరగా అమ్మకాలు

మండలంలోని ముద్దుర్తి జంక్షన్ సమీపంలో ప్రభుత్వం సుమారు ... మిగతా 8వ పేజీలో

మిట్టల్ స్టీల్ మరో అడుగు

తొలిదశ పనులకు ప్రభుత్వం పచ్చజెండా

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పారిశ్రామిక హబ్‌గా జిల్లా అభివృద్ధి చెందబోతున్నది. దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపుతున్నాయి. అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, అనకాపల్లి పరిసరాల్లో పరిశ్రమల స్థాపనకు క్యూ కడుతున్నారు. నక్కపల్లి ఏపీఐఐసీ సెజ్‌లో ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. లక్ష 35 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల వార్షిక స్టీల్ ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. మొదటి దశలో రూ.55,964 కోట్ల పెట్టుబడితో ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను నిర్మిస్తారు. 2029 జనవరినాటికి ఉత్పత్తిని ప్రారంభిస్తారు. దీనిలో 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రెండో దశలో రూ.80 వేల కోట్ల పెట్టుబడితో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నెలకొల్పుతారు. దీనిలో 2033 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తారు. రెండో దశలో 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

- పెట్టుబడి.. రూ.55,964 కోట్లు
- ఉత్పత్తి.. 7.3 మిలియన్ టన్నులు
- 2029నాటికి ఉత్పత్తి ప్రారంభం
- డీఎల్ పురంలో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ఆమోదం
- రెండు దశల్లో రూ.11,196 కోట్లతో నిర్మాణం
- హ్యాండ్లింగ్ సామర్థ్యం 31 మిలియన్ టన్నులు
- 2029 జనవరి నాటికి అందుబాటులోకి రానున్న పోర్టు



మిట్టల్ స్టీల్ ప్రతినిధులతో నక్కపల్లి సెజ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ (ఫైల్ ఫొటో)



క్యాప్టివ్ పోర్టు ఏర్పాటు కానున్న డీఎల్‌పురం సముద్ర తీర ప్రాంతం

డీఎల్ పురంలో క్యాప్టివ్ పోర్టు

అనకాపల్లి/ నక్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మిట్టల్ స్టీల్ ఇండియా కంపెనీ ప్రతినిధుల అభ్యర్థన మేరకు నక్కపల్లి మండలం డీఎల్ పురం వద్ద 2.9 కిలోమీటర్ల వాటర్ ఫ్రంట్‌తో క్యాప్టివ్ పోర్టు (స్టీల్ ప్లాంట్ సొంత అవసరాలకు) నిర్మాణానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దీనికి అనుమతుల కోసం కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్‌కు సంబంధించి రాయితీ ఒప్పందంలోని క్లాజ్ నంబరు 30.1.1ను (ఇండియన్ పోర్టు యాక్ట్-1908) సవరిస్తూ నిర్ణయం తీసుకున్నది. తొలుత రూ.5,816 కోట్ల అంచనా వ్యయంతో ఏటా 20.5 మిలియన్ టన్నుల హ్యాండ్లింగ్ సామర్థ్యంతో పోర్టును నిర్మిస్తారు. ఇది 2029నాటికి అందుబాటులోకి (స్టీల్ ప్లాంట్ మొదటి దశలో ఉత్పత్తి మొదలయ్యేనాటికి) తెస్తారు. ఇక్కడ వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రెండో దశలో రూ.5,380 కోట్ల వ్యయంతో ఏటా 10.5 మిలియన్ టన్నుల హ్యాండ్లింగ్ సామర్థ్యంతో పోర్టును విస్తరిస్తారు. దీని ద్వారా మరో 5 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి.

టీడీపీలో వర్గపోరు

బుచ్చెయ్యపేట మండల విస్తృతస్థాయి సమావేశ ఫ్లెక్సీలో కానరాని జిల్లా అధ్యక్షుడి ఫొటో



గొడవ పడుతున్న టీడీపీకి చెందిన రెండు వర్గాల కార్యకర్తలు



పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- తాతయ్యబాబు అనుచరుల అభ్యంతరం
- ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఏమిటంటూ ఆగ్రహం
- ఇరువర్గాల మధ్య గొడవ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుకు అవమానం జరిగిందని ఆయన వర్గీయులు ఆందోళనకు దిగారు. బుధవారం ఇక్కడ జరిగిన టీడీపీ మండల విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తాతయ్యబాబు ఫొటో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు సమక్షంలో ఇరువర్గాల ... మిగతా 8వ పేజీలో

కొడుకు మరణంతో తల్లడిల్లిన కన్న పేగు

వరహా నదిలో దూకి మహిళ ఆత్మహత్య

నర్సీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన చిన్న కొడుకు గుండెపోటుతో మృతిచెందడాన్ని మాతృ హృదయం తట్టుకోలేక పోయింది. కుమారుడు మరణాన్ని పదేపదే తలుచుకొని బెంగ పెట్టుకుంది. చివరకు వరహా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ పోలీసులు, మృతిరాలి పెద్దకుమారుడు దుర్గారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నానికి చెందిన కోన గౌరి(50)కి దుర్గారావు, రాము సంతానం. పిల్లల చిన్నతనంలోనే భర్త సత్తిబాబు చనిపోయాడు. అయినప్పటికీ మనోధైర్యంతో పిల్లలిద్దరిని కష్టపడి పెంచి పెద్ద చేసింది. చిన్న కుమారుడు రాము అంటే గౌరికి అమితమైన ప్రేమ. కుమారులిద్దరూ అబీద్ సెంటర్‌లో పూల వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 14వ తేదీన రాము(24) గుండెపోటుతో ... మిగతా 8వ పేజీలో



కోన గౌరి (ఫైల్ ఫొటో)

నక్కపల్లిలో క్యాప్టివ్ పోర్టు

▸ రాష్ట్ర హోంమంత్రి అనిత

పాయకరావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నక్కపల్లిలో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం ఎక్స్ వేదికగా ఆమె ప్రకటన చేస్తూ రానున్న రోజుల్లో నక్కపల్లి మండలంలో రూ.1.47 లక్షల కోట్ల పెట్టుబడులతో ఆర్సెలార్ మిత్తల్, నిప్పన్ స్టీల్స్ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఎగుమతుల కోసం సొంత పోర్టు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకు సీఎంకి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోండి

నక్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నక్కపల్లి వారపుసంత చిరు వ్యాపారులను ఆదుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేశ్ డిమాండ్ చేశారు. వ్యాపారుల కోసం రేకు షెడ్లను నిర్మించాలన్నారు. పాకలు దగ్ధం కావడంతో నష్టపోయిన వ్యాపారులంతా గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్తానని వెంకటేశ్ హామీ ఇచ్చారు.

గూడుపమ్మను దర్శించుకున్న ఎలమంచిలి కౌన్సిలర్లు

నక్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాకలో గూడుపమ్మ క్షేత్రాన్ని గురువారం ఎలమంచిలి మున్సిపాలిటీ కౌన్సిలర్లు సహా పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఎలమంచిలి మున్సిపల్ కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, మాజీ కౌన్సిలర్ సియ్యాద్రి శ్రీను, సోరంగి చిన్న, కిల్లాడ సత్యనారాయణ దర్శించుకున్నారు. ధర్మకర్త శ్రీహరిరాజు ఆధ్వర్యంలో వారిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా శంకరరావు



అచ్యుతాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా దేశంశెట్టి శంకరరావుని నియమితులయ్యారు. మండలంలోని దుప్పితూరు సర్పంచ్‌గా కొనసాగుతున్న శంకరరావుకి ఈ పదవి రావడం ఇది మూడోసారి. పార్టీ నాయకులతోపాటు అభిమానులు శంకరరావుని అభినందించారు.

నేడు కొత్తపేటలో రామాలయం ప్రారంభం

రాంబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఈనెల నాలుగో తేదీన ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామచంద్రమూర్తిల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. గురువారం రామాలయం ఆవరణలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు

రాంబిల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తులు చేసుకున్నవారికి మామిడివాడ కెనరాబ్యాంక్, భోగాపురం ఏపీజీవీబీ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండు బ్యాంకుల అధికారులు 150 మందికి ఇంటర్వ్యూలు చేశారు. కార్యక్రమంలో మండలపరిషత్ అధికారులు, బ్యాంక్ సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎస్.రాయవరం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వమ్మవరం, పెదగుమ్ములూరు, గోకులపాడు ఫీడర్ల పరిధిలోని వమ్మవరం, గెడ్డపాలెం, గోకులపాడు, భీమవరం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

జీవనోపాధి ప్రణాళికపై శిక్షణ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం స్వయం సహాయ సంఘాల మహిళలకు 2025-26 ఏడాదికి జీవనోపాధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. వెలుగు సిబ్బంది ఎన్యూమరేటర్స్, వీవోఏలకు వీడియో ద్వారా సీసీలు అవగాహన కల్పించారు.

అలరించిన పెదబోదిగల్లం విద్యార్థుల ప్రదర్శనలు

నక్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు, 9వ తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపారు. హెచ్ఎం బోడిశెట్టి సత్యనారాయణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పిల్లలు ఆటపాటలతో అలరించారు.బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలోఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, కుమారి, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో మూలకు చేరిన బోర్లు

▸ పట్టించుకోని అధికారులు

▸ వేసవి వచ్చినా మరమ్మతులు చేయని వైనం

ఎలమంచిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు నీటిని అందించే చేతిబోర్ల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వేసవి ముందు నుంచే తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు, పాలకులు ఆదేశిస్తున్నా.. ఎలమంచిలిలో మాత్రం పట్టించుకున్న నాథులే లేరు. మునిసిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మూలకు చేరిన చేతిబోర్లు అనేకం ఉన్నా వాటికి మరమ్మతులు చేయడం లేదు. వేసవి వస్తే చాలు మునిసిపల్ ప్రజలకు ఏటా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది కూడా తాగునీటికి అవస్థలు తప్పవేమోనని ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ సమయంలో తాగునీటి వ్యవస్థ దెబ్బతిన్న సమయంలో చేతిబోర్లు ప్రజల దాహార్తిని తీర్చడంలో ఎనలేని సేవలు అందించాయి. అన్ని వేళలా ప్రజలకు తాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కించే చేతి బోర్ల నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం



కోర్టుపేట వీధిలో మూలకు చేరిన బోరు



ములకలాపల్లిలో పనిచేయని బోరు

వహిస్తున్నారని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. పట్టణంలోని క్రీడామైదానంలో, కోర్టుపేట వీధిలో కూరగాయల బుజ్జి దుకాణం వద్ద, వెంకటాపురంలో, పులపర్తి గ్రామంలో సచివాలయం ఎదురుగా, ములకలాపల్లి సిమెంట్ పరిశ్రమ సమీపంలో మూలకు చేరిన చేతి బోర్లు అనేకం ఉన్నాయి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉన్నతాధికారులు స్పందించి చేతి బోర్లను పునరుద్ధరించేలా సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శిథిల స్థితిలో వైలోవ పాఠశాల భవనాలు

▸ శ్లాబ్ పెచ్చులు పడుతున్న వైనం

▸ బీటలు వారిన గోడలు

▸ తరగతి గదుల్లోకి వస్తున్న వర్షపు నీరు

▸ మరమ్మతులు చేయించాలంటున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

రాంబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైలోవ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాల గదులు శిథిలమై, శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. 1970వ సంవత్సరంలో రెండు తరగతి గదులను నిర్మించారు. ఈ గదులు పూర్తిగా శిథిలమవ్వడంతో ప్రమాదకరంగా మారాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు చెందిన 24 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రధానంగా పాఠశాల గదుల గోడలు, శ్లాబ్‌లు బీటలు వారాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపడి ఇనుప ఊసలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిసిన సమయంలో నీరు గదుల్లోకి వచ్చేస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. ఏ సమయంలో గదుల శ్లాబ్ పెచ్చులు విద్యార్థులపై పడి ఏ ప్రమాదం ముంచుకొస్తోందనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయపడుతున్నారు.



శిథిల స్థితిలో ఉన్న వైలోవ ఎంపీపీ పాఠశాల భవనం



శ్లాబ్ పెచ్చులు ఊడిపోయిన పాఠశాల గది

ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాలను బాగు చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాల శిథిల భవనాన్ని తొలగించాలి



ఈదటంలో జడ్పీ హైస్కూల్‌లో శిథిల భవనం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదటం గ్రామంలో జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న శిథిల భవనాన్ని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. హైస్కూల్ ఎంట్రన్స్‌లో ఉన్న ఈ భవనం పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. చాలా సంవత్సరాల కిందటే ఈ భవనాన్ని తొలగించడానికి అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే ఇంతవరకు దీనిని తొలగించలేదు. విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేసవి సెలవుల్లోనే శిథిల భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. ఈ భవనంలో పాఠశాల నూతన భవనాల నిర్మాణ సామగ్రి సిమెంటు, ఐరన్ తదితర వస్తువులు వేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రస్తుతం తరగతి గదుల నిర్మాణం జరుగుతున్నందున, భవనాన్ని తొలగించలేదని, వచ్చే విద్యాసంవత్సరానికి తొలగిస్తామన్నారు.

ఉపాధి హామీతో పేదలకు ఆర్థిక భరోసా



ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్న శ్రీవేణి



రేగుపాలెంలో పనులను ప్రారంభిస్తున్న అన్నం బాబ్జీ



ఆవరాజంలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నానాజీ

▸ ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి శ్రీవేణి

అచ్యుతాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఉపాధి హామీ పథకంతో ఆర్థిక భరోసానిస్తుందని ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి అన్నారు. గురువారం మడుతూరు చెరువులో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో దొంగ మస్తర్లు వేసుకొని లక్షలాది రూపాయలు కొల్లగొట్టారన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నిర్వహించే జనవాణిలో ఫిర్యాదు చేసి ఆధారాలతో సహా నిరూపించామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శనివాడ ఆనందరావు, నీరుకొండ సంతోష్, తిమ్మాపాత్రుని గోవింద, శనివాడ నాగేశ్వరరావు, నందారపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఉపాధి హామీ పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అన్నం బాబ్జీ అన్నారు. గురువారం రేగుపాలెంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి లాలం సోమునాయుడు, బీజేపీ నేత కొల్లి సత్యనారాయణ, జనసేన నేతలు మల్లిపాటి మహాలక్ష్మి నాయుడు, అనపర్తి రాజు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అచ్చియ్యనాయుడు, ఎన్నేటి రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరందుకుంటున్నాయి. జగ్గన్నపేటలో ఉపాధి కూలీలతో కాలువ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఆవరాజంలో సర్పంచ్ వియ్యపు నానాజీ చెరువు పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీల జీవనోపాధికి ఉపాధి పనులు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ నానాజీ అన్నారు.

'వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి'



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు

పాయకరావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు స్థానిక ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీఈపీడీసీఎల్ పట్టణ, రూరల్ ఏఈలు మహంకాళిరావు, పరదేశిలతో సమావేశమైన ఆయన సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రక్షిత నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం, లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులతోపాటు ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, ఏఓ సీహెచ్ఆర్‌కే.వర్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జి.నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

పాయకరావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధుల్లో పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూరగాయలు, హోటళ్లు, తదితర చిరు వ్యాపారులతో మాట్లాడుతూ చెత్తను నిర్దేశించి ప్రదేశంలో వేసి పారిశుధ్యం మెరుగుకు పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు.అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుతోపాటు, మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో చెత్త తరలించే పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ చంద్రశేఖర్

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఇళ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని నామవరంలో గురువారం ఆయన ఇంటింటికి తిరిగి గృహిణులకు తడి చెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జునాచారి, శివ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కొక్కిరాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం పాపాజీరావు

ఘనంగా కొక్కిరాపల్లి యూపీ స్కూల్ వార్షికోత్సవం

ఎలమంచిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కొక్కిరాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం. ఆకుల పాపాజీరావు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులంతా స్కూల్ ఆవరణను పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

విద్యార్థులంతా ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.అనూష, వి.సుజాత, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో చురుగ్గా పారిశుధ్య పనులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సెజ్ పునరావాస కాలనీలో పారిశుధ్య పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈకాలనీలో సరైన వసతులు లేక నిర్వాసిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో 'సెజ్ పునరావాస కాలనీలో సమస్యలు తిష్ఠ' శీర్షికతో వెలుగులోకి తెచ్చింది. ఆ కథనంపై స్పందించిన ఎమ్మెల్యే బుధవారం అధికారులు, గ్రామ నాయకులు సమక్షంలో సమావేశం ఏర్పాటుచేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గురువారం నుంచి పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఐదు వందల ఎకరాల పరిధిలో ఉన్న ఈ కాలనీలో వీధుల్లో చెత్తలేకుండా చర్యలు చేపట్టారు. తర్వాత కాలువల్లో పూడిక తీసి మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టనున్నారు. గురువారం కాలనీలో ఈవోపీఆర్డీ శ్రీరామనాయుడు పర్యటించి పారిశుధ్య కార్మికులకు సూచనలిచ్చారు.



పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న ఈవోపీఆర్డీ శ్రీరామనాయుడు

ఘనంగా శివయ్య పెండ్లి రాటోత్సవం



శివపార్వతుల కల్యాణానికి రాట వేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక ప్రాచీన శివాలయంలో ఈనెల 8వ తేదీన జరగనున్న శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవానికి గురువారం ఉదయం పెండ్లిరాటను వేశారు. తొలుత ఆలయ అర్చకులు వెలవలపల్లి మహేశ్, సంతోశ్ ముక్కంటికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం సమీపాన శివయ్యపెండ్లి రాటోత్సవ కార్యక్రమాన్ని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ వీరబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొండబాబు, కృష్ణ, వెంకటరమణ, జగదీశ్, గుప్త, వెంకటేశ్వరరావు, కొల్లాటి బుజ్జి, డీలర్ హరిబాబు, దిలీప్, బాబాజీ, రవి,తదితరులు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



రంగనాయకులును సత్కరిస్తున్న యాదవ సంక్షేమ సంఘం నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులును గురువారం హరిపురంలోని ఆయన నివాసంలో యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భరిణికాన సాయినాధరావు, జిల్లా నాయకులు భరిణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు, పంచదార్ల సూరిబాబు, బి.వెంకటరమణ, వియ్యపు సింహాచలం, పల్లా తాతారావు, తదితరులు సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ యాదవుల సంక్షేమానికి తను మరింతగా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, హరిపురం మాజీ సర్పంచ్ ధూళి రమణ పాల్గొన్నారు.

బంగారమ్మపాలెం గ్రామాన్ని తరలించండి

▸ ఎస్‌డీసీ మనోరమకు మత్స్యకారుల వినతి



సమావేశంలో పాల్గొన్న ఎస్‌డీసీ మనోరమ, తహసీల్దార్ తదితరులు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెంలో గురువారం ఎస్ఏవోబీ నిర్వాసితులతో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మనోరమ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ఎస్ఏవోబీ నిర్మాణం పూర్తయితే చేపల వేటకు కూడా వెళ్లనీయకుండా అడ్డుకునే అవకాశం ఉందని, గ్రామాన్ని మరోచోటకు తరలించాలని కోరారు. అలాగే వాకపాడు నుంచి బంగారమ్మపాలెంకు రోడ్డు నిర్మాణం, జెట్టీ నిర్మాణంతోపాటు ఉద్యోగాలు తదితర పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మనోరమ మాట్లాడుతూ వాకపాడు నుంచి బంగారమ్మపాలెంకు రోడ్డు నిర్మాణం, జెట్టీ నిర్మాణం చేపడతారన్నారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్‌కు పేర్లు ఇచ్చిన వారికి శిక్షణ ఇస్తారన్నారు. మిగిలిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఫిషరీస్ జేడీ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఏఈ సత్యవేణి, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల ఐదో తేదీ నుంచి నిర్వహించనున్న పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ పోస్టర్‌ను గురువారం అనకాపల్లిలో డీఈవో అప్పారావు నాయుడు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న పీఆర్‌టీయూ బృందాన్ని అభినందించారు. గోపీనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడు భద్రరావు, రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ ఎన్ఎస్ రాజా, మండల సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పరవాడ మండల అధ్యక్షుడు కోవెల రవి పాల్గొన్నారు.

మూడు రోజుల పెళ్లి సందడి

పల్లకిలో పెళ్లి జంట వైభవంగా ఊరేగింపు



పల్లకిలో ఊరేగుతున్న నవజంట జాని, నీలిమ

అచ్యుతాపురంరూరల్, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి): ఆచారాలు, సంప్రదాయాలు తెరమరుగవుతున్న ప్రస్తుత రోజుల్లో పూర్వపు పద్ధతులను నలుగురికి తెలియజేయాలని నిరుపేద కుటుంబం ఆలోచన పలువురి ప్రశంసలను అందుకుంటోంది. మండలంలోని ఎం.జగన్నాథపురంలో పల్లకిలో పెళ్లి జంట ఊరేగింపు సంప్రదాయాన్ని గుర్తు చేసింది. గ్రామానికి చెందిన జంపా నూకరాజు, లక్ష్మి దంపతుల కుమారుడు నాని(జాని)కి, విజయనగరం జిల్లా తెర్లాం మండలం పెరుమాళి గ్రామానికి చెందిన పొట్నూరి రమణ, సత్యవతి దంపతుల కుమార్తె నీలిమతో బుధవారం అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. అయితే పెళ్లి కొడుకు జాని మాత్రం పాతసంప్రదాయంలో వివాహం జరిపించాలని కోరడంతో అతని తల్లిదండ్రులు మూడు రోజుల వివాహ తంతును జరిపించారు. దీనిలోభాగంగా గురువారం పల్లకిలో దంపతులను ఊరేగించారు. ఈ సందర్భంగా ఎం.జగన్నాథపురం గ్రామస్థులు సంప్రదాయాన్ని గుర్తుచేసిన నూకరాజు కుటుంబాన్ని అభినందించారు.

ప్రతి మండల కేంద్రంలో వాలీబాల్ కోర్టు

▸ కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం ▸ జిల్లాస్థాయి క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశంలో దిశానిర్దేశం

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లాస్థాయి క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తగిన తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే వారు మరింతగా రాణిస్తారని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయ పాలన, క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో జేసీ

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ



బూత్ ఇన్‌చార్జికి సభ్యత్వ కార్డులు అందజేస్తున్న పీలా గోవింద

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ కార్డులను అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ గురువారం ఇక్కడ పంపిణీ చేశారు. 83వ డివిజన్ పరిధిలో గల తొమ్మిదవ క్లస్టర్‌కు సంబంధించి 171 బూత్ టీడీపీ కార్యకర్తల సభ్యత్వ కార్డులు బూత్ ఇన్‌చార్జి ఎస్.భానుచందర్‌కు అందజేశారు. పార్టీ సభ్యత్వం పొందిన అందరికీ వీటి అందేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చికూర రాము, రమేష్, పొలిమేర ఆనంద్, నాయుడు, షేక్ రియాజ్, ఆళ్ల జగది తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణపై అవగాహన



నీటి సంరక్షణపై అవగాహనకు విద్యార్థినులు వేసిన చిత్రాలు

కశింకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరుల సంరక్షణపై కొళాయిల వద్ద ఉన్న మహిళలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. వెదురుపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం 'సమాజమా మేలుకో - సహజ వనరులను కాపాడుకో' నినాదంతో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నీటి వనరులను ఏ విధంగా కాపాడుకోవాలో చార్టుపై చిత్రాలను గీసి వివరించారు. నీటి వృథా వల్ల కలిగే అనర్థాలు, నీటి పొదుపు వల్ల ప్రయోజనాలను తెలియజేశారు. వేసవి కారణంగా నీటిని మరింత పొదుపు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి, ఉపాధ్యాయులు సబిత లక్ష్మి, రమేష్, సోమరాజు, చిన్నారావు, సత్యనారాయణమూర్తి, నూకరాజు, విజయ్, త్రివేణి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉమాశంకర్

కశింకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశంకర్ గురువారం ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఈసీఎస్ పరిధిలోని వినియోగదారుల పిల్లలు, జిల్లాలోని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. శిక్షణకు వచ్చే ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేయనున్నామన్నారు. ఇంజనీరింగ్ కోర్సు చదవడానికి, ఉద్యోగావకాశాలకు పాలిటెక్నిక్ విద్య ఉపయోగకరంగా పేర్కొన్నారు. ఈ తరగతులు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్. గణేశ్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి రమణకుమార్, సీనియర్ లెక్చరర్లు వై.వీరేంద్ర, ఎం.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి బోధనా సామగ్రి అందజేత



స్పీచ్ తెరపి మిషన్ ద్వారా విద్యార్థికి వివరిస్తున్న ఉపాధ్యాయుడు

కశింకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట ఎంపీపీ స్కూల్-2లోని భవిత కేంద్రానికి పరవాడ ఎన్టీపీసీ సంస్థ బోధనా సామగ్రిని అందజేసినట్టు ప్రత్యేక ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప గురువారం తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వివిధ రకాల పరికరాలను సంస్థ రూ.82,000 వెచ్చించి కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ సామగ్రిని ఎంఈవో సురేష్‌కుమార్ పరిశీలించి మాట్లాడారు. ఈ సామాగ్రి వల్ల దివ్యాంగ విద్యార్థులకు బోధన మరింత సులభతరం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రామునాయుడు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామాలయాల్లో వసంత నవరాత్రులు నిర్వహించాలి



తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని రామాలయాలు కేంద్రంగా ఈనెల వసంత నవరాత్రులు కార్యక్రమాన్ని నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ కన్వీనర్ మల్లిమడుగుల నాగపేర్రాజు సూచించారు. ఇక్కడి సినిమాహాల్ జంక్షన్ వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఏర్పాటైన ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. వసంత నవరాత్రుల విశిష్టతను ప్రజలకు వివరించాలన్నారు. రామాలయాల్లో ప్రతి రోజూ సామూహిక హారతితో పాటు భజనలు జరపాలన్నారు. అనంతరం తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఫౌండేషన్ మండల కన్వీనర్ పెదపాటి కళ్యాణి, మండల సహ కన్వీనర్ బొద్దపు నూకరత్నం, ఎం. సునీత, గొర్లె ఎరుకునాయుడు, హరిబాబు, అప్పలనాయుడు, సతీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న వేడుకల్లో గురువారం రాత్రి భక్తి గేయాలు, కూచిపూడి నాట్యం స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నెల్లూరుకు చెందిన ఆదర్శ వరదాయిని బృందం ఆలపించిన భక్తి గేయాలతో పాటు విశాఖకు చెందిన చిన్నారుల కూచిపూడి నాట్యం ప్రశంసలు పొందాయి. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి.

నూకాంబికను దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు



అమ్మవారికి ఎమ్మెల్యే సుందరపు, సురేంద్ర పూజలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మ వారిని గురువారం వేర్వేరు సమయాల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలోని పూజలు నిర్వహించారు. నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

బాల సంజీవిని 2.0 యాప్ సవరణ చేయాలి

▸ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

కశింకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సిబ్బందికి పనిభారం పెంచడం తగదని, తక్షణమే బాల సంజీవిని 2.0 యాప్‌ను సవరణ చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు డిమాండ్ చేశారు. మండలంలోని జెడ్.తుని గ్రామంలో గురువారం ఏర్పాటైన సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బందికి పనితగిన పారితోషికం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ఆందోళనలు చేస్తుంటే యాప్‌ల ద్వారా పనిభారం పెంచడం సరికాదన్నారు. బాల సంజీవిని 2.0. న్యూ వెర్షన్‌తో యాప్ రిలీజ్ చేసి ఈ యాప్‌లో కూడా వర్కర్స్, హెల్పర్, ఫొటో క్యాప్చర్ తీసుకొని ప్రతి లబ్ధిదారునికి క్యాప్చర్ చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ సరిగా లేక టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోయారు. 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని, నెట్ వర్క్ రీచార్జ్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే తమ సమస్యలన్నింటిపైన స్పందించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు



దిబ్బవీధి రామాలయం వద్ద పసుపు దంచుతున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి వేడుకలకు సంబంధించి పట్టణంలోని దిబ్బవీధి రామాలయం వద్ద గురువారం ముహూర్తపు రాట వేశారు. ఈ నెల ఆరో తేదీన సీతారాముల కల్యాణం జరపనున్న నేపథ్యంలో ముత్తైదువులు ముహూర్తం ప్రకారం ఉదయం రాట వేసి, పసుపును దంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాడి భాస్కరరావు, మద్దాల జగదీశ్వరరావు, శిలపరశెట్టి శ్రీను, కాండ్రేగుల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



శుభపత్రిక ఆవిష్కరణలో దాడి రత్నాకర్, తదితరులు

ఇదిలావుంటే, పెదరామస్వామి ఆలయంలో జరగనున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారి శుభపత్రికను గురువారం ఆలయ ఆవరణలో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నేతృత్వంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రత్నాకర్ తెలిపారు. ఆరో తేదీ ఉదయం 11.53 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన, ఎనిమిదో తేదీ రాత్రి ఊంజల్ సేవ వంటివి నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, కొణతాల భాస్కరరావు, కొణతాల అప్పలనాయుడు, బొడ్డేడ శంకర్రావు, కొణతాల గోపి, పెతకంశెట్టి శ్రీనివాసరావు, కోరుబిల్లి ఆరుద్ర, కర్రి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై అసత్య ఆరోపణలు

▸ అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి

▸ సీఐకు హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి ఫిర్యాదు



సీఐ అల్లుస్వామినాయుడుకు ఫిర్యాదు చేస్తున్న సమితి ప్రతినిధులు

కశింకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై కొంత మంది కావాలనే ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బోని గణేశ్ అన్నారు. ఈ మేరకు సీఐ అల్లు స్వామినాయుడును గురువారం కలిసి అసత్య ప్రచారం చేస్తున్న జీవీ హర్షకుమార్, కేఏ పాల్, పాస్టర్ జాబ్ బెన్నీలింగం, పాస్టర్ అజయ్‌బాబులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత విద్వేషాలను రెచ్చగొట్టి హిందువులే మతోన్మాదులుగా మారి హత్య చేశారని ఆరోపించడం తగదన్నారు. సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు మైలపల్లి పోతురాజు, మండపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸ ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పండా గణేశ్



నిరసన శిబిరంలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న గణేశ్

తుమ్మపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : క్వారీ కార్మికుల సమస్యలను యాజమాన్యాలు తక్షణమే పరిష్కరించాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పండా గణేశ్ డిమాండ్ చేశారు. బవులువాడలో క్వారీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. క్వారీ కార్మికులు శ్రమించి విధులు నిర్వహిస్తూ యాజమాన్యాలకు కోట్లాది రూపాయల లాభాలు సమకూరుస్తున్నప్పటికీ, యాజమాన్యాలు శ్రమజీవులను పట్టించుకోక పోవడం తగదన్నారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారన్నారు. అలాగే క్వారీ, క్రషర్లలో కార్మికులకు రక్షణ కరువైందన్నారు. కనీస వేతన ఒప్పంద చర్చలకు యాజమాన్యాలు రాకుండా మొండి వైఖరి ప్రదర్శించడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోన మోహనరావు, సేనాపతి అప్పలనాయుడు, సీహెచ్. చిన్నారావు, నూకరాజు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాల సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీఈఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సబ్బవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఆర్మీలో ఇంటర్ అర్హత కలిగిన నిరుపేద విద్యార్థులకు ఉద్యోగాల కొరకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని ఇక్కడి రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ పోతల సత్యనారాయణ గురువారం తెలిపారు. నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 99120 22474, 70134 56140 నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

రహదారి చెంతనే కోళ్ల వ్యర్థాలు

▸ ఇష్టారాజ్యంగా పారబోస్తున్న పలువురు వ్యాపారులు

▸ దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న స్థానికులు



పరవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే ప్రధాన మార్గంలో శ్మశానవాటిక దాటిన వెంటనే రహదారి పక్కనే బాయిలర్ కోళ్ల వ్యర్థాలను గుట్టలుగా పారబోస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. కొంతమంది చికెన్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పారబోస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఫలితంగా ఇటుగా రాకపోకలు సాగించే స్థానికులతో పాటు వాహనదారులు ముక్కుమూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుట్టలుగా పారబోసిన వ్యర్థాలను కుక్కలు చిందర వందర చేస్తుండడంతో వాతావరణం మరింత పాడవుతోందని పలువురు వాపోతున్నారు. చికెన్ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో పడవేయరాదు. అయినప్పటికీ పరవాడ ప్రాంతంలో పలువురు వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోళ్ల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



రహదారికి ఆనుకొని పారబోసిన చికెన్ వ్యర్థాలు

తప్పిపోయిన ఐదేళ్ల బాలిక

▸ గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు

పరవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఐదేళ్ల బాలికను గంటల వ్యవధిలోనే పరవాడ పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. దీనికి సంబంధించి పరవాడ సీఐ జి. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో జి.నూకరాజు కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె కుసుమశ్రీ(5) స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతోంది. పాఠశాల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి వచ్చిన చిన్నారికి తల్లి రాజేశ్వరి కనిపించలేదు. అదే సమయంలో బాలిక తల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ఈ విషయం తెలియని బాలిక తన తల్లి కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో కంగారు పడిన తల్లిదండ్రులు సాయంత్రం నాలుగు గంటలకు పరవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఎస్ఐలు కృష్ణారావు, మహలక్ష్మి, ప్రసాద్ తమ సిబ్బందితో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బాలిక సాయంత్రం 6.45 గంటల సమయంలో దిబ్బలగొర్లెవానిపాలెంలో ఓ ఇంటి వద్ద కనిపించింది. వెంటనే పోలీసులు ఆ బాలికను స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ సమక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే తమ కుమార్తెను అప్పగించడం పట్ల బాలిక తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

'వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి'



అవగాహన కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది

తుమ్మపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండ తీవ్రత అధికమవుతున్న వేళ వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ సూచించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై గురువారం పాపయ్యపాలెం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రతల వేళ కాటన్ దుస్తులు ధరించాలని, ఆహార నియమాలలో సైతం మార్పులు చేసుకోవాలని సూచించారు. ఎక్కువగా ఇళ్లలో తయరు చేసుకున్న ద్రవాలను తీసుకోవాలన్నారు. అవసరమైతే తప్ప ఎండ సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది విజయ్ కుమార్, శాంతకుమారి, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు



సబ్బవరంలో ఇంటర్వ్యూలు జరుపుతున్న అధికారులు

సబ్బవరం, ఏప్రిల్ 3 : వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు అభ్యర్థులు పోటెత్తారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యాలయం అధికారులు, బ్యాంకు అధికారులు రుణాల కోసం ఇంటర్వ్యూలు జరిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు సంబంధించిన రుణాల కోసం 24 పంచాయతీల నుంచి 892 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఇక్కడ ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ గుల్లేపల్లి అధికారులు ఇంటర్వ్యూలు జరిపారు. మొత్తం 740 మంది హాజరయ్యారని మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి శివరామకృష్ణ తెలిపారు. అర్హత పత్రాలు పరిశీలించి, త్వరలోనే అర్హుల జాబితాను పంచాయతీల వారీగా ప్రకటిస్తామని తెలిపారు.

కశింకోటలో...

కశింకోట : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలు కార్పొరేషన్ల రుణాలు పొందేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. మండల వ్యాప్తంగా మొత్తం బీసీలు 620 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 496 మంది హాజరయ్యారని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు.

మహిళా సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేయాలని వినతి



పీవోకు వినతిపత్రమిస్తున్న సెక్యూరిటీ గార్డులు

పాడేరురూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గురుకులం, ఏకలవ్య పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేయడంతోపాటు వారికి మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డులు గురువారం జేసీ, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో ఎస్ఆర్ఆర్ టెండర్ సంస్థ ద్వారా 60 మంది ఆదివాసీ మహిళలు సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారన్నారు. వారి టెండర్ గడువు గత మార్చితో పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో వారి ఉద్యోగాలను రెన్యువల్ చేయాలన్నారు. ప్రస్తుతం వారికి నెలకు రూ. 7,500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గురుకులం సొసైటీ రూల్ ప్రకారం నెలకు రూ. 14 వేలు చెల్లించాలని కోరారు. మహిళా సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంతికుమారి, రాజేశ్వరి, ఈశ్వరమ్మ, కస్తూరి, సుభద్ర, రాజేశ్వరి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఐటీడీఏ డ్రైవర్ మృతి



డ్రైవర్ సూర్యనారాయణ(ఫైల్)

పాడేరురూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏలో వివిధ విభాగాల్లో 40 ఏళ్లపాటు డ్రైవర్‌గా సేవలందిస్తున్న దొండ సూర్యనారాయణ (62) గురువారం మధ్యాహ్నం విధి నిర్వాహణలో ఉంటుండగా గుండె పోటుకు లోనై మృతి చెందారు. 1985లో మినిమం టైం స్కేల్ పద్ధతిన డ్రైవర్‌గా విధుల్లో చేరిన సూర్యనారాయణ ఎక్కువ కాలం ఐటీడీఏ గ్యాస్ వాహన డ్రైవర్‌గా పనిచేశారు. ఆయన గ్యాస్ గౌడౌన్ నుంచి ఐటీడీఏ పాడేరు కాఫీ ఏడీ వాహన డ్రైవర్‌గా బదిలీ అయ్యారు. అతనికి రెండేళ్ల క్రితం గుండె శస్త్రచికిత్సజరిగింది. గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఉండగా, గుండె నొప్పి వచ్చింది. వెంటనే సహచర సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో సూర్యనారాయణ మృతి చెందారు. ఈ ఏడాది జూలైలో 62 ఏళ్ల పూర్తయి పదవీ విరమణ చేస్తారు. ఈ నేపథ్యంతో ఆయన మృతి చెందడం సహచర ఉద్యోగుల్లో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత దుర్మరణం



లువ్వాబు శ్రీను(ఫైల్)

పాడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో మండలానికి చెందిన టీడీపీ నేత, వార్డు సభ్యుడు లువ్వాబు శ్రీను (35) మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. మండలంలో గుత్తులపుట్టు పంచాయతీ వంతాగుమ్మికి చెందిన లువ్వాబు శ్రీను సొంత పనిపై బుధవారం పెదబయలు వెళ్లి రాత్రి తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో హుకుంపేట మండలం ఎం.బొడ్డాపుట్టు సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చింతచెట్టును ఢీకొట్టింది. దీంతో శ్రీను తల చెట్టుకు బలంగా తగలడంతో హెల్మెట్ ఉన్నప్పటికీ అక్కడక్కడే మృతి చెందారు. దీంతో గుత్తులపుట్టు పంచాయతీలో విషాదం అలముకుంది. ఆయన మృతికి టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేశ్‌కుమార్, తదితరులు సంతాపం తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



వర్తకులకు నోటీసులు అందజేస్తున్న ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో దుకాణాల వద్ద వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. గురువారం జీకేవీధి వారపు సంతలో వర్తకులకు ఎంపీడీవో నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వ్యాపారులు విక్రయిస్తే రూ.500 నుంచి రూ.5వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ప్రజలు గుడ్డ సంచులను వాడాలని ఆయన ఈసందర్భంగా సూచించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

ఆహార సలహా మండళ్లు ఉన్నట్టా.. లేనట్టా?

» డీఆర్ డిపోలపై కొరవడిన పర్యవేక్షణ.. రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

» ఐదేళ్లుగా సమావేశాలు నిల్

కొయ్యూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను సరి చేసేందుకు ప్రతీ మూడునెలలకోసారి నిర్వహించాల్సిన ఆహార సలహా మండలి సమావేశాలు ఐదు సంవత్సరాలుగా జరగడంలేదు. దీంతో మన్యంలో డీఆర్ డిపోల నిర్వహణ, లోటుపాట్లు సరిదిద్దడానికి వీలులేక ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆహార సలహా మండళ్లకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తిలోదకాలిచ్చింది. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మండల ఆహార సలహా మండలి రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతోపాటు ప్రజల భాగస్వామ్యం, తహసీల్దారు, పౌరసరఫరాల విభాగాధికారితో కలిపి 16 మందితో ఏర్పాటు చేసే వారు. ఈ కమిటీ మండలాల్లో ప్రతీ మూడు మాసాలకు ఓసారి సమావేశమై పౌరసరఫరాల విభాగంలోలోటుపాట్లను చర్చించటం, వాటిని సక్రమైన దారిలో నడిపించేలా నిర్ణయాలు తీసుకునేవారు. అయితే, 20-19లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్వహణ వదిలేయడంతో డీఆర్‌డిపోల్లో అవినీతి అక్రమాలు పెచ్చుమీరాయి. డిపోలు నిత్యం తెరచి ఉంచాలనే నిబంధన గాలిలో కలిసింది. మన్యంలో మారుమూల కొండలపై గల పలు గ్రామాల గిరిజనులకు అందించాల్సిన బియ్యం మినహా మిగిలిన మిగిలిన నిత్యావసర సర కులు డిపోల నిర్వహణ సక్రమంగా లేక పేదలకు రాయితీపై పొందలేకపోతున్నారు. నిబంధనల మేరకు మండల తహసీల్దార్ ప్రతీ మూడు నెలలకు విధిగా ఆహార సలహా మండలి సమావేశం నిర్వహించాల్సి ఉంది. డీఆర్ డిపోల నిర్వహణపై నెలకొన్న సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. కానీ, వైసీపీ ప్రభుత్వం ఈ పద్ధతికి చరమగీతం పాడింది. ఈ నేపథ్యంలో కొయ్యూరులో 2018న వంబరులో ఈ సమా వేశం ఏర్పాటు జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఈ సమావేశం నిర్వహణపై లేక డీఆర్‌డిపోల తీరు అక్రమాల పుట్టగా మారాయి.మారుమూల గ్రామాలలో ఉచిత బియ్యంతో పాటు రాయితీ సరకులు సక్రమంగా అందక గిరిజనులు లబోదిబోమంటున్నారు. పౌరసరఫరాల వ్యవస్థను పటిష్టపరిచేలా 2018లో అప్పటి పాడేరు సబ్ కలెక్టర్ బాలాజీ డీకే ప్రతీ నెలా ఆహార సలహా మండలి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. వీటిని ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టి ఏ సమస్యలు లేకుండా చూసేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన పాడేరులో ఉన్నంత వరకు ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా నడిచింది. అనంతరం అక్రమాల పుట్టగా మారింది. ఇకనైనా ఆహార సలహా మండలి సమా వే శాలు నిర్వహణపై దృష్టిసారించి లోపాలను సరిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

పెదబయలు సంత ఆశీలు వేలం ఖరారు



మోహనరావుకు ధ్రువ పత్రం ఇస్తున్న ఈవోపీఆర్డీ

పెదబయలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెదబయలులో ప్రతి సోమవారం నిర్వహించే వారపు సంత ఆశీల వేలం గురువారం సీతగుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పలాసి మాధవరావు, ఈవోపీఆర్డీ నరసింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. రూ. 3. 12 లక్షలకు మునిడిపుట్టుకు చెందిన పసుపుల మోహనరావుసంత ఆశీలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమేశ్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు, ఉప సర్పంచ్ గంగాధరం, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు సన్నిబాబు, వార్డు సభ్యుడు గండేరు జీవన్‌కుమార్, రాధాకృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టిహారంపై అవగాహన

డుంబ్రిగుడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న టేక్ హోం పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాగర పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు రామచంద్ అన్నారు. గురువారం కిల్లోగుడ అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీవో నీలిమ అధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాలతః కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి

పాడేరురూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీన భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలోని ప్రతీ గిరిజన గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు కేం ద్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చే పట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, రాష్ట్ర ట్రైకార్ బోర్డు సభ్యులు కూడా కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు శరభ వేమనబాబు, కార్యదర్శి దొంబునాయుడు, వి.రామచంద్ర పాల్గొన్నారు.

రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి: తహసీల్దార్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వో, వ్యవసాయ సహాయకులుతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుకోవాలన్నారు. ఎంఏవో మధుసూదనరావు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి: కలెక్టర్ దినేశ్‌కుమార్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్ట దినేశ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తదితరులు



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్

పాడేరురూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని కలెక్టర్ కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఉత్సవాలు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 36వ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్థానిక ఎమ్మెల్యే, ఆలయ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి టోర్నీని విజయవంతం చేయాలన్నారు. ఈ టోర్నీని కలెక్టర్ బ్యాటింగ్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు బౌలింగ్ చేసి క్రీడాభిమానులను అలరించారు. అనంతరం ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ మే 11, 12, 13వ తేదీలలో మోదకొండమ్మ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో 72 క్రీడా జట్లు పాల్గొంటున్నాయన్నారు. మొదటి రోజు పాడేరుకు చెందిన రెండు క్రికెట్ జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు, టోర్నీ నిర్వాహకులు సీదరి రాంబాబు, కొంటా దుర్గారావు, మహేష్, వైస్ఎంపీపీ కె.కనకాలమ్మ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రశాంత్, సురేష్‌కుమార్, కెజియారాణి, రత్నాబాయి, నాయకులు ఎస్.మంగ్గన్నదొర తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ వేదిక ప్రారంభం



వేదిక ప్రారంభోత్సవంలో పాల్గొన్న గిడ్డి ఈశ్వరి తదితర పెద్దలు

పాడేరురూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాడేరు సుండ్రుపుట్టులోని పురాతన సీతారామ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సీతారాముల నూతన కల్యాణ వేదికను గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఘనంగా ప్రారంభించారు. ఈ నిర్మాణానికి సహకరించిన దాతలకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, గిరికైలాస క్షేత్రం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, జనసేన పార్టీ నాయకులు వంపూరు గంగులయ్య, కె.వెంకటరావు, మోదకొండమ్మ ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, గ్రామ పెద్దలు దన్నేటిపలాసి సురేష్, జవ్వాది లింగమూర్తి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



నిరాశ్రయులైన బాధిత కుటుంబం

కొయ్యూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గురువారం సాయింత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన వంజరి అంజనేయులుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. అంజనేయులు కుటుంబ సమేతంగా జీడిమామిడి తోటకు వెళ్లగా అకస్మాత్తుగా ఇంటి నుంచి పొగలు వచ్చి ప్రమాదం సంభవించినట్టు స్థానికులు తెలిపారు. గ్రామస్థులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. దీంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి చెందిన రూ. 50 నగదుతో పాటు రెండు తులాల బంగారం, గృహోపకరణాలు, తిండి గింజలు, బట్టలుతో పాటు రేషన్, ఆధార్‌కార్డులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. వీఆర్వో, గ్రామ సర్పంచ్ మాకాడ బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నష్టాన్ని అంచనా వేసి తహసీల్దారుకు నివేదించనున్నట్టు వీఆర్వో తెలిపారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



సీతారాముల విగ్రహం

సీలేరు, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ అటవీప్రాంతంతో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో రామాలయం నిర్మాణం దాత హైదరాబాద్‌కు చెందిన ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులుబొబ్బిలికి చెందిన కళ్యాణ గురుస్వామి, దామోదరస్వామి గణపతి పూజ, సర్వదూవత్య హోమాలు, పీఠన్యాసం, యంత్రన్యాసం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఏపీ రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయల నిర్మాణ దాత ముక్తేశ్వరరావు, వేదపండితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణ దాతకు శ్రీనివాసానంద సరస్వతి ఆశీస్సులను అందించారు. అనంతరం సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో ఇంజనీర్ బీవీఎస్ సుబ్రహ్మణ్యం దంపతుల ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీలేరు, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాల్గొన్న సాధు పరిషత్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాస నంద సరస్వతి

జాతీయ స్థాయి కరాటే పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు, కోచ్ రాజేశ్

జి.మాడుగుల, ఏప్రిల్ 3 (ఆంధ్రజోతి) : థాంగుట మార్షల్ ఆర్ట్స్ మణిపూర్, ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలకు మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులుఎంపికైనట్టు సుమన్ సూడోకన్ రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ ఆకాడమీ జిల్లా కో-ఆర్డినేటర్ సాగేని రాజేశ్‌కుమార్ తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ద్వితీయసంవత్సరం బైపీసీ చదువుతున్న సోముల రమ్య ఢిల్లీకి, దుక్కేరి ప్రమీల మణిపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్టు చెప్పారు. ఈ చిన్నారులను తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్ఐ షణ్ముఖరావు, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు అభినందించారు.

అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి: జడ్పీ చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం జన్ మన్ పథకం కింద మండల పరిధిలో 5, 361 ఇళ్లు మంజూరైతే, కేవలం రెండు వేల ఇళ్ల పనులు ప్రారంభం కావడంపై హౌసింగ్ అధికారులను నిలదీశారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సకాలంలో బిల్లులు అందించాలని హౌసింగ్ డీఈ రాజుబాబు, ఏఈ కృష్ణారావులకు ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో పనులను సర్పంచులు, ఎంపీటీసీలకు తెలియకుండా జరుగుతుండడంపై ఏఈ రాములకు ఆమె సూచించారు. పంచాయతీ రాజ్ ద్వారా బీటీ రోడ్లును పూర్తి చేయాలని ఏఈ మురళీకృష్ణను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి , ఈవోపీఆర్డీవో చిన్నాన్న పాల్గొన్నారు.

ఇంజరింగ్ అసిస్టెంట్లు వినతి పత్రం

తమ సమస్యలపై సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జడ్పీ చైర్‌పర్సన్ వినతి పత్రం అందించారు. తమ విధులలో భాగంగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్ఎంఐ, పీఐయూ , హౌసింగ్ పనులతోపాటు నాన్ టెక్నికల్ పనులు, సర్వేలు, ఫించన్ల పంపిణీ వంటి పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి: జడ్పీటీసీ సభ్యుడు

అనంతగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు పంచాయతీ టెంకబూడ్డి, బూసిపాడు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు. గురువారం ఆయా గ్రామాలకు జడ్పీటీసీ గంగరాజు మండుటెండలో కాలినడకన చేరుకుని గిరిజనులు సమస్యలపై అడిగితెలుసుకున్నారు. ఆయా గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడం.. అత్యవసర పరిస్థితిల్లో గిరిజనులు డోలీమోతలకు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సర్పంచ్ సీతయ్య, తదితరులు పాల్గొన్నారు..

మే 4 నుంచి మత్స్య మాడుగులమ్మ ఉత్సవాలు

జి.మాడుగుల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మత్స్యమాడుగులమ్మ ఉత్సవాలు మే నెల 4 నుంచి 6వరకు వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.గురువారం నూతన ఉత్సవ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా ఎం.మత్స్యరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.రెడ్డిబాబు, కోశాధికారిగా మత్స్యరాజు, గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రులు మత్స్యరాస బాలరాజు, మణికుమారి, వరహాలరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 30 మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఎంవీజీ రాజు, మత్స్యరాజు, సింహాచలంరాజు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు గోల్డీ సేవలు మరువలేం: ఎంఈవో

చింతపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు ఈదల గోల్డీ సేవలు మరువలేమని ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ అన్నారు. గురువారం పదవీ విమరణ పొందిన గోల్డీకి లంబసింగి గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు గెమ్మెలి బోడంనాయుడు, ఎల్.రాంబాబు, పీజీహెచ్ఎంలు బాకూరి సత్యనారాయణరాజు, వీరభద్రరావు, ఎస్. విమల ఉమారి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, నాయకుడు కొర్రు మత్స్యలింగం, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డి. మహేశ్వరరావు, ఏటీడబ్ల్యూవో అప్పలనర్స జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మాజీ సర్పంచ్ కర్ణం బాబ్జీ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి మధ్యలో నిలిచిన కంటెయినర్

» పెదబయలు-ముంచంగిపుట్టు మార్గంలో వాహన చోదకులకు అవస్థలు



సీతగుంట పాత వీధి జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిన భారీ వాహనం

పెదబయలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెదబయలు - ముంచంగిపుట్టు రహదారిలో ఓ భారీ కంటెయినర్ వాహనం అడ్డంగా నిలిచిపోవడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం పిడిలైట్ కంపెనీ నుంచి పెయింటింగ్ బాక్సులతో జైపూర్, కురుక్షేత్ర మీదుగా అంబలాకు చేరాల్సిన హర్యానాకు చెందిన ఈ వాహనం గురువారం ఉదయం 8 గంటల సమయంలో పెదబయలు సమీపంలో గల సీతగుంట పాత వీధి జంక్షన్‌లో సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు, విధులకు వెళ్ళవలసిన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొల్లి రమణ తన సిబ్బందితో చేరుకున్నారు. రోడ్డు పక్కన గల పొలం మీదుగా వాహనాలను మళ్లించారు. అనంతరం కంటెయినర్‌ను బయటకు తీయటానికి సుమారు ఐదు గంటల సమయం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో మెకానిక్‌ను పిలిపించి కంటెయినర్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యను పరిష్కరించారు. గూగుల్ మ్యాప్ సాయంతో ఒడిస్సా జైపూర్ మీదుగా వెళ్లాల్సిన ఈ వాహనం ముంచంగిపుట్టు వైపు వచ్చినట్టు ఆ డ్రైవర్ తెలిపారు. తిరిగి వెనక్కి వెళ్లే క్రమంలో చిక్కుపోయినట్టు వాపోయాడు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు

» జిల్లా వ్యవసాయ అధికారి సేవియర్ నందు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నందు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్ నందు అన్నారు. మండల మహిళా సమాఖ్య వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సేంద్రీయ సాగుపై ప్రణాళిక కార్యక్రమాన్ని మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నందు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్)ను 2028 నాటికి పాడేరు డివిజన్‌లోని గత రైతులు ఎటువంటి ఎరువులు, రసాయన కీటక నాశక మందులు వినియోగించకుండా శత శాతం ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రసాయన ఎరువులతో కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యసాయం మేనేజర్ భాస్కరరాఉ, ఏపీఎంఐపీ పీడీ రహీమ్, ఏవో శ్రీనివాస బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకి ప్రభుత్వ ప్రోత్సాహం

చింతపల్లి: ఆదివాసీ రైతులను గంజాయికి ప్రత్యామ్నయంగా ఉద్యాన, వ్యవసాయ పంటల సాగు చేయాలని ఏవో బి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని శివారు బలపం పంచాయతీ కోరుకొండ, చెరువూరు, జోహేరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి సాగు చట్టరీత్యా నేరమన్నారు. గంజాయికి ప్రత్యామ్నయంగా ఇతర పంటలను సాగు చేయాలన్నారు. ఈ మేరకు విత్తనాలు, మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుకు అవసరమైన ప్రోత్సాహక నిధులను అందిస్తామన్నారు. అలాగే 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను అందించనున్నట్టు చెప్పారు. వీటి ద్వారా అధిక ఆదాయం పొందచ్చునన్నారు. వ్యవసాయ సహాయకులు వసుపరి సౌందర్య పాల్గొన్నారు.

నర్సీపట్నంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

- డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి
- డ్రోన్ ద్వారా బహిరంగంగా మద్యం సేవించిన వారిని గుర్తింపు
- ఇకపై నిత్యం నిఘా ఉంటుందని పోలీసు అధికారులు వెల్లడి


డ్రోన్ కెమెరా ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసాంఘిక కార్యకలాలు జరుగుతున్నట్టు గుర్తించిన పలు ప్రాంతాల్లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం డ్రోన్ కెమెరాను ఉపయోగించారు. శివపురం, గున్రాల రోడ్డు, ఇందిరా మార్కెట్, బలిఘట్టం శివాలయం ప్రాంతం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెద్ద చెరువు ప్రాంతాలలో డ్రోన్ కెమెరా దృశ్యాల ద్వారా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఇక నుంచి ప్రతి రోజూ డ్రోన్ కెమెరా ద్వారా నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'జీలుగు కల్లు విక్రేతలపై క్రిమినల్ కేసులు అన్యాయం'


ఎక్సైజ్ స్టేష వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

నర్సీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీలుగు కల్లు అమ్ముకుంటున్న ఆదివాసీ గిరిజనులపై ఎక్సైజ్ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకుడు కె.గోవిందరావు అన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ముందు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైన్ సిండికేట్ ఒత్తిళ్లతోనే సాంప్రదాయ జీలుగు కల్లు విక్రయిస్తున్న గిరిజనులపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులకు మద్యం వ్యాపారులు లంచాలు ఇచ్చి గిరిజనులపై కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం జీలుగు కల్లుకు మినహాయింపు ఇచ్చిన సంగతి ఎక్సైజ్ అధికారులు విస్మరించడం తగదన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పలువురు ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

7న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గొలుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఈనెల ఏడో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ.మేరీరోజీ తెలిపారు. ఆ రోజు బ్యాంకుల అధికారులు వచ్చి ఈ ప్రక్రియను చేపడతారన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారంతా రెండు సెట్ల జెరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఎనిమిది గ్రామాలకు గుంతల రోడ్డే గతి!

- అస్తవ్యస్తంగా తాండవ- నాతవరం రహదారి
- అవస్థల నడుమ ప్రజలు రాకపోకలు
- వర్షాలు కురిస్తే మరిన్ని కష్టాలు


గోతులతో అధ్వానంగా ఉన్న తాండవ- నాతవరం రోడ్డు

నాతవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మూడు మండలాల పరిధిలో గల పలు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే తాండవ- నాతవరం రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డులో నిత్యం చమ్మచింత, గంటావారి కొత్తగూడెం, కురువాడ, ఆడాకుల, మాధవనగరం, కృష్ణాపురం, రొంగలకొత్తూరు గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. రోడ్డు మరీ దారుణంగా తయారు కావడంతో వర్షాలు కురిసే సమయాల్లో వాహనదారుల అవస్థలు తీవ్రంగా ఉంటున్నాయి. ఆయా గోతుల్లో నీరు చేరుతుండడంతో రోడ్డు ఎక్కడో, గొయ్యి ఎక్కడ గుర్తించలేని పలువురు గాయాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కనీస ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో మూడేళ్ల క్రితం ప్రస్తుత స్పీకర్, అప్పటి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, జనసేన నాయకులు సూర్యచంద్ర తదితరులు తాండవ రోడ్డులో క్వారీ క్రషర్ నుంచి బుగ్గి తీసుకు వచ్చి పూడ్చడంతో పాటు ఈ రోడ్డును బాగుచేయాలని ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ సదరు పాలకులు పట్టించుకోలేదు.

ఇదిలావుంటే, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నాతవరం మండలంలో చాలా రోడ్లను పక్కాగా తీర్చిదిద్దినప్పటికీ నాతవరం, కొయ్యూరు, గొలుగొండ మండలాలను కలుపుతూ ఉపయోగపడే తాండవ రోడ్డును మాత్రం అధికారులు పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక కేంద్రంగా ఉన్న తాండవ రిజర్వాయర్‌కు వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధానమని చెపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో 2016లో తాండవ నుంచి గొలుగొండ మండలాన్ని కలుపుతూ అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు తారు రోడ్డు వేయించారని, అయితే మండల కేంద్రం నాతవరం- తాండవ రోడ్డు ఏడు కిలోమీటర్లు మేర పెద్దపెద్ద గోతులతో అధ్వాన్నంగా మారడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఈ కారణంగా తాండవ రోడ్డు వెంబడి గొలుగొండ మండలం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. అలాగే, నాతవరం మండలం నుంచి తక్కువ దూరంలో కొయ్యూరు మండలం కంఠరాం, బాలరాం గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డునే ఆశ్రయించాల్సి వస్తోందని చెపుతున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డు మరమ్మతులపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే దృష్టి సారించాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కృష్ణాదేవిపేట పరిసరాల్లో వర్షం


ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వర్షం కురుస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. నాలుగు గంటలు దాటిన తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకుని చినుకులతో ఆరంభై మోస్తరుగా వర్షం పడింది. దీంతో గత వారం రోజులుగా ఎండలతో అల్లాడుతున్న జనం ఒక్కసారిగా ఉపశమనం పొందారు.

వర్షాకాలంలోపు చెరువుల్లో పూడిక తీత

ఉపాధి హామీ అధికారులకు 'తాండవ' కమిటీ చైర్మన్ సత్యనారాయణ సూచన


పైలవాని చెరువులో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

నాతవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలం లోపు సాగు నీటి చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని ఉపాధి హామీ పథకం అధికారులకు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ సూచించారు. మండలంలోని చినగొలుగొండపేటలో తొమ్మిది లక్షల రూపాయల వ్యయంతో పైలవాని చెరువులో చేపట్టనున్న పూడితతీత పనులను గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం అధికారులు పంట పొలాలకు నీరు పారే పిల్ల కాలువలను కూడా ఈ పథకంలో భాగంగా బాగుచేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. అలాగే ఈ వేసవిలో కూలీలు ఉదయం ఆరు గంటలకే పనులలోకి వచ్చి పదకొండు గంటలకు ముగించుకుని ఇళ్ల చేరితే ఎండబారిన పడకుండా ఉంటారన్నారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు


సభలో మాట్లాడుతున్న డీటీ నూకరాజు

మాకవరపాలెం , ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కాకర నూకరాజు కోరారు. రాచపల్లిలో భూముల రీ సర్వేపై అవగాహనకు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ గ్రామంలో ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైన భూములను గుర్తించామన్నారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ఐదు గ్రామాల్లో భూములను రీసర్వే చేసి రికార్డులను సరిచేస్తామని చెప్పారు. భూముల రీ సర్వే రైతులకు ఎంతో మేలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, వీఆర్వో సాంబ, జట్టి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో సిమెంటు రోడ్లు


పోలవరంలో నిర్మాణానికి శంకుస్థాపన

గొలుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గల శ్మశాన వాటికలకు సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పోలవరం, కొత్తఎల్లవరం, అమ్మపేట గ్రామాల్లో గల శ్మశానవాటికల్లో ఈ పనులకు ఆయా నాయకులు శంకుస్థాపనలు జరిపారు. ఈ కార్యక్రమంలో చీడిగుమ్మల మాజీ ఎంపీటీసీ సభ్యుడు భీమిరెడ్డి సత్యనారాయణ, టీడీపీ నాయకులు కామిరెడ్డి గోవింద, మొండెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

గొలుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని అర్హులందరికీ పనులు కల్పిస్తామని ఏపీవో సూర్యమణి తెలిపారు. అమ్మపేట, పాకలపాడు, చీడిగుమ్మల, గొలుగొండ, పాత మల్లంపేట, పప్పుశెట్టిపాలెం, ఏటిగైరంపేట గ్రామాల్లో గల పొలాల్లో గురువారం కందకాలు తవ్వించే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉంచేందుకు ఈ పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. టీడీపీ నాయకులు దేముడు నాయుడు, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయి రూ.6.75కోట్లు

- వడ్డాది సబ్ డివిజన్ ఏడీఈ సురేశ్‌కుమార్


మాట్లాడుతున్న ఏడీఈ

రావికమతం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో నాలుగు మండలాలలో రూ.6 కోట్ల75 లక్షల మేర గ్రామ పంచాయతీలు విద్యుత్ బిల్లులు బకాయి ఉన్నట్టు ఏపీఈపీడీసీఎల్ వడ్డాది సబ్ డివిజన్ ఏడీఈ ఎ.సురేశ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.వెంకన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏడీ మాట్లాడారు. గ్రామ పంచాయతీలు 2025 జనవరి 31 నాటికి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ స్థితిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటి వసూళ్లపై గ్రామ పంచాతీలను నేరుగా కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఏటా రూ. లక్షల్లో వస్తున్న విద్యుత్ బిల్లులను చిన్న పంచాయతీలు ఎలా చెల్లించగలవని మత్స్యవానిపాలెం కార్యదర్శి పోలిరెడ్డి, పలువురు కార్యదర్శులు లేవనెత్తారు. అనంతరం ఏడీ సురేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, రావికమతం మండలం రూ. 1. 81 కోట్లు, బుచ్చియ్యపేట మండలంలో రూ. 2. 22 కోట్లు, మాడుగుల మండలంలో రూ. 1. 86 కోట్లు, చీడికాడమండలంలో రూ. 86 లక్షలు గ్రామ పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిఉందని ఏడీ తెలిపారు.

గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నేత రామునాయుడుకు మాతృవియోగం


శరగడం నాగరత్నం(ఫైల్‌ఫొటో)

చోడవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు మాతృమూర్తి నాగరత్నం (75) రెండురోజుల క్రితం మృతి చెందారు. నాగరత్నంకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. రామునాయుడు కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు, గోవాడ షుగర్స్ ఎండీ సన్యాసినాయుడు, స్థానిక టీడీపీ నాయకులు పలువురు కార్మికులు సంతాపం తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర వైద్య బృందం


రికార్డులు పరిశీలిస్తున్న ప్రతినిధులు

రోలుగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వైద్య, ఆరోగ్య బృందం ప్రతినిధు లుమం డలంలోని బుచ్చెంపేట పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేశారు. రెండు రోజులుగా ఈ ప్రతినిధులు వాసంతరెడ్డి, హిమబిందులు పీహెచ్‌సీలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్నారు. రోగుల సేవలను తనిఖీ చేశారు. నిధుల వినియోగంపై రికార్డులనుపరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో సబ్‌సెం టర్ల నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సునీత, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల శాఖ కార్యదర్శిగా సోమాదుల దేవి

చోడవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల శాఖ కార్యదర్శిగా సోమాదుల దేవి నియమితులయ్యారు. బుధవారం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సోమాదుల దేవి, సహాయ కార్యదర్శిగా విస్సారపు నాగూర్‌లు నియమితులైనట్టు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


పాతవలసలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని పాతవలస, దాలివలస, సింగన్నదొరపాలెం, ఏ కోడూరు గ్రామాల్లో రూ. 1. 60 కోట్లతో సీసీ రోడ్లు, వాటర్‌ట్యాంక్, పశువుల నీటి తొట్టెలు తదితర అభివృ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాతవలస ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వాణిజ్య పం టలు సాగుపై ఆసక్తి చూపించాలన్నారు. ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మండలంలో పలు గ్రామాల నుంచి విశాఖ నగరానికి 50 శాతం కూరగాయలు రవాణా అవుతున్నాయన్నారు. జీడి, మామిడి, పామాయిల్ తదితర పంటలకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లు పూర్తయ్యాయన్నారు. ప్రధానమైన కొన్ని రహదారులను డబుల్ రోడ్లు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ నిధులతో వ్యవసాయ సాగుకు వీలుగా నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనకాపల్లి జిల్లాలో అనేక పరిశ్రమలు వస్తున్నాయని, యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. గ్రామాల అభివృద్ధి పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు పీవీజీ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, పాతవలస సర్పంచ్ జామి శ్రావణ్, పూడి నారాయణమూర్తి, దాలివలస సర్పంచ్ బి. దేముళ్ళు, బి. గంగునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడంనాయుడు, ఏ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, నాయకులు సబ్బవరపు రామునాయుడు, దాడి ఎరుకునాయుడు, జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు, కన్నూరు లక్ష్మీనారాయణపాల్గొన్నారు.


కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చోడవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం కిటకిటలాడింది. ఎంపీడీవో ఆంజనేయులు ఆధ్వర్యంలో అధికారులు, బ్యాంకర్లు దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూ చేసి, వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. శుక్రవారం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

పశువుల కోసం తాగునీటి తొట్టెల నిర్మాణం

చీడికాడ: వేసవిలో పశుపక్షాదులకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు గ్రామాల్లో నీటితొట్టెలు నిర్మించాలని స్థానిక ఎంపీడీవో హేమసుందరరావు ఆదేశించారు. తర కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడారు. 23 పంచాయతీల్లో వీటిని నిర్మించాలన్నారు. ఉపాధి కూలి రూ.307 గిట్టుబాటు అయ్యేలా చూడాలని కోరారు. గ్రామాల్లో జరిగే సర్వేలపై వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.కనకమ్మ, ఏపీవో అల్లు గంగునాయుడు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ పట్నాలగోపి, తదితర అధికారులు పాల్గొన్నారు.

చింతపండుకి తగ్గని గిరాకీ


కోనాం సంతలో చింత విక్రయం

చీడికాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గురువారం కోనాం సంతలో చింతపండుకు గిరాకీ తగ్గలేదు. గత ఆరు వారాలుగా ధర క్రమేపీ పెరుగుతుండటంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పచ్చళ్ల సీజన్ కావడంతో చింతపండు వినియోగం అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో చింత పండుకు గిరాకీ నెలకొన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ప్రతీ గురువారం కోనాంలో జరిగే సంతకు చీడికాడతోపాటు పాడేరు, అనంతగిరి, హుకుంపేట, పెదబయలు మండలాల్లోని పలు గ్రామాల గిరిజనులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం చింతపండు సీజన్ కావడంతో ఎక్కువమంది దీనిని తీసుకువస్తున్నారు. సుమారు 20 కిలోల బరువు గల కావిడి చింతపండు గత వారం రూ.1600లు నుంచి రూ. 1650లకు అమ్మకాలు చేయగా, ఈ వారం రూ.1600లు నుంచి రూ.1800కు విక్రయించారు.

అనుచరులతో పోలేపల్లి పంచాయతీ సర్పంచ్ టీడీపీలో చేరిక

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్.రాజు
- బుచ్చయ్యపేట మండలంలో వైసీపీకి షాక్


పోలేపల్లి సర్పంచ్ పైడినాయుడికి టీడీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పోలేపల్లి సర్పంచ్ సీతా పైడినాయుడు టీడీపీలో చేరారు. గురువారం బుచ్చెయ్యపేటలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్‌రాజు సమక్షంలో తనఅనుచరులు 100మందితో కలిసి టీడీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తాము పార్టీ మారినట్లు తెలిపారు. పార్టీలో చేరినవారికి తగిన గుర్తింపు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు జి.కోటేశ్వరరావు, టీడీపీ వడ్డాది అధ్యక్షులు దొండా నరేశ్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

బుచ్చెయ్యపేటలో గురువారం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్.రాజు ప్రజాదర్బార్ ఏర్పాటుచేసి వినతిపత్రాలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ, తాగునీటి సమస్య, ఉపాధి, విద్యుత్ సమస్యలు అధి కంగా వచ్చాయి.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసరావు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, సుంకర లక్ష్మి, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినుల రక్షణకు శక్తి వారియర్స్ గ్రూపులు : ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్ఐ రఘువర్మ

రావికమతం, ఏపిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు లైంగిక వేధింపులకు లోనుకాకుండా ప్రతి తరగతిలో ఓ శక్తి వారియర్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక ఎస్ఐ. ఎం.రఘు వర్మ తెలిపారు. గురువారం రావికమతం, మేడివాడ హైస్కూళ్లు, మరుపాక మోడల్ స్కూల్, గర్నికం కేజీబీవీ పాఠశాలలో శక్తి వారియర్ గ్రూపులను ఏర్పాటు చేశారు. పాఠశాలలు, బస్ స్టాప్‌లవద్ద, మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారి వివరాలు శక్తి టీమ్‌లకుగాని ,పోలీసులకు గానీ తెలపాలన్నారు.

కంచాలు వితరణ


ఆలయానికి కంచాలను ఇస్తున్న భక్తులు

దేవరాపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవా డ షిర్డీ సాయి ఆలయంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న అన్నదానానికి వీలుగా 50 స్టీలు కంచాలను ముషిడిపల్లి గ్రామానికి చెందిన సిరపారపు పైడంనాయుడు దంపతులతో పాటు వారి అల్లుడు పరవాడకు చెందిన పైల శ్రీను, బాంధవి దం పతులు విరాళంగా అందజేశారు. తండారపు అప్పారావు, అనేదాత 25 కిలోల వంట పాత్రలు అందజేశారు. రైవాడకు చెందిన కురుమోజు ఈశ్వరరావు, ప్రభ దంపతులు సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి: ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సైతం తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సర్వే చేసి తాగునీటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పాల్గొన్నారు.

మోడల్ గ్రామాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద మోడల్ గ్రామాలుగా ఎంపికైన ఐదు గ్రామాల్లో ప్రతి ఇంటికి సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మోడల్ గ్రామాలుగా గుర్తించిన మండలాల అధికారులు, గ్రామ సర్పంచులు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ గ్రామాలుగా గుర్తించిన కశింకోట మండలం బయ్యవరం, సబ్బవరం మండలం గుల్లేపల్లి, మునగపాక మండలం తోటాడ, ఎస్.రాయవరం మండలం గుడివాడ, గొలుగొండ గ్రామాల్లో సూర్యఘర్ పథకం అమలు పురోగతిని సమీక్షించారు. సోలార్ యూనిట్ ఏర్పాటుకు ఉచిత దరఖాస్తుతో పాటు కేంద్ర, రాష్ట్రాల సబ్సిడీ, బ్యాంకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఇంటికి వన్ కేవీ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థిని అదృశ్యం

రావికమతం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెడ్.కొత్తపట్నంలో పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొబ్బిలి రాజు, కుమారిల కుమార్తె సాయిసంజన స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నది. ఈ నెల ఒకటో తేదీన పదో తరగతి చివరి పరీక్ష రాసింది. అదే రోజు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు వరం

నిరుపేదలకు ఉచితంగా శిక్షణ



శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులు

» ప్రభుత్వ ఆదేశాలతో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కోచింగ్

» వైసీపీ హయాంలో మూలనపడేసిన ప్రక్రియ

» కొద్దిరోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్

» బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వందలమందికి అవకాశం

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సుమారు 16 వేలకుపైగా పోస్టులను భర్తీచేయాలని నిర్ణయించిన నేపథ్యంలో అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించే ఏర్పాట్లు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసింది. ఎన్నికలకు ముందు హడావిడిగా ఆరువేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ ప్రక్రియను పూర్తి చేయలేకపోయింది. దీంతో ఎన్నికల సమయంలోనే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అంతేకాకుండా నిరుపేద అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో 16 వేలకుపైగా పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి ఉపాధ్యాయులు విధు ల్లో చేరేలా ప్రక్రియను పూర్తిచేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిరోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



ఉచిత శిక్షణకు ఆదేశాలు

డీఎస్సీకి సిద్ధమయ్యే నిరుపేద అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. నాలుగు నెలలు కిందట జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 85 మందికి శిక్షణ అందించింది. బీసీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు పుస్తకాల కోసం రూ.వెయ్యి, నెలకు రూ.1500 చొప్పున భృతి అందించింది. వీరి శిక్షణ పూర్తయింది. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మరో 100 మంది నిరుపేదలకు శిక్షణ ఇప్పించింది. తాజాగా ఎస్సీ, మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను తీసుకుంది. ఈ రెండు కేటగిరీల విద్యార్థులకు విశాఖలోని వినెక్స్ స్టడీ సెం టర్‌లో ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.26,500 చొప్పున మూడు నెలలకు ఖర్చు చేస్తోంది. ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సదుపా యాన్ని కల్పిస్తు న్నారు. మెటీరియల్ అందించనున్నారు. గత నెల 23న శిక్షణ ప్రారంభమైంది. 90 రోజులపాటు కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ కేంద్రంలో 292 మంది శిక్షణ పొందుతున్నారు. రెండో దశలో మరో 200 మంది ఎస్సీ అభ్యర్థులు వస్తారని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. రెండో దశలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని రెండు సంస్థలకు ప్రభుత్వం శిక్షణ బాధ్యతలను అప్పగించినట్టు చెబుతున్నారు. మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని 50 మంది విద్యార్థులకు ఇక్కడే శిక్షణ ఇస్తారు. దరఖాస్తు గడువు ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

వందల మందికి మేలు..

డీఎస్సీ శిక్షణ ఖర్చుతో కూడిన వ్యవహారం. ప్రస్తుతం మూడు నెలలు శిక్షణకు కనీసం రూ.20 వేల వరకు ఖర్చు వుతుంది. మెటీరియల్‌కు మరో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇప్పించే కార్యక్రమాన్ని చేపట్టడంతో వారందరికీ ఆర్థిక ఇబ్బందులను తప్పించినట్టు అయింది. శిక్షణకు ఎంపికైన వారిలో 99 శాతం మంది నిరుపేద కుటుంబాల వారే. దీంతో ఈ శిక్షణ మంచి అవకాశంగా చెబుతున్నారు.

ప్రేమోన్మాదికి 14 రోజులు రిమాండ్

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తనతో పెళ్లికి నిరాకరించారనే అక్కసుతో ఒకరిని హత్య చేసి, మరొకరిని తీవ్రంగా గాయపరిచిన ప్రేమోన్మాదికి భీమిలి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కొమ్మాది స్వయంకృషి నగర్‌కు చెందిన నక్కా దీపిక అనే యువతిని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం పనసనందివాడకు చెందిన నవీన్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తనతో పెళ్లి చేయడానికి ఆమె తల్లి లక్ష్మి నిరాకరించడం, దీపిక నచ్చజెప్పే ప్రయత్నం చేయకపోవడాన్ని సహించలేకపోయిన నవీన్ బుధవారం కత్తితోదాడి చేశాడు. దీంతో లక్ష్మి మృతిచెందగా, దీపిక తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. దాడి అనంతరం నవీన్ బైక్‌పై శ్రీకాకుళం వైపు పరారైపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసిన పోలీసులు గురువారం భీమిలి కోర్టులో హాజరుపరిచారు.

టీడీఆర్‌లు వద్దు.. నగదు చెల్లించాలి

» అధికారులకు తేల్చి చెప్పిన అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులు



అధికారులతో మాట్లాడుతున్న నిర్వాసితుడు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):

టీడీఆర్‌లు వద్దని, తమకు డబ్బులే కావాలని అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులు అధికారులకు తేల్చి చెప్పారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అనకాపల్లి - అచ్యుతాపురం రహదారి విస్తరణలో భూములు, స్థలాలు కోల్పోతున్న బాధితులతో ఆర్డీవో షేక్ ఆయిషా, వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో షేక్ ఆయిషా భూములు కోల్పోయే రైతులకు ఇచ్చే టీడీఆర్ ఉపయోగాలను వివరించారు. ప్రతీ టీడీఆర్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని, రైతులకు అవసరమైనప్పుడు ఎక్కడైనా ఆన్‌లైన్‌లో చెక్ చేసుకొని అమ్మకాలు చేసుకోవచ్చునన్నారు. భూముల విలువ పెరిగిన ప్రతీసారి టీడీఆర్ విలువ కూడా పెరుగుతుందని వివరించారు. అందువల్ల టీడీఆర్‌లు తీసుకొని రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2020 మాస్టర్ ప్లాన్ ప్రకారం అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ 150 అడుగులుగా ఉందన్నారు. అయినా ఎవరూ ఇబ్బంది పడకుండా ఉండేలా వంద అడుగులకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటూ ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. అయితే టీడీఆర్‌లకు నిర్వాసితులు అంగీకరించలేదు. ఆ టీడీఆర్‌లు మీరే తీసుకొని మా అకౌంట్‌ల్లో డబ్బులు జమ చేయాలని తనకాల జగ్గారావు, కాకర్ల రమేశ్, సింధూ, రామచంద్రరావులు అధికారులను కోరారు. ఈ రహదారిని విస్తరించకుండా అవసరమైతే ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రత్యేక రహదారిని నిర్మించుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయంలో సహకరించాలన్నారు. భారీ వాహనాలు ఈ మార్గం గుండా వెళ్తూ ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నాయని ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ స్పందించ లేదని వాపోయారు. భూములు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని, అయితే టీడీఆర్‌లకు బదులు నగదు రూపంలో తమ అకౌంట్‌ల్లో నష్టపరిహారం జమ చేయాలని కోరారు. రోడ్డు అభివృద్ధికి రూ.150 కోట్లు వరకు ఖర్చవుతున్నందున ఆ మొత్తాన్ని అచ్యుతాపురం మార్గంలోని కంపెనీల వద్ద తీసుకొని నిర్మాణం చేపట్టాలని కాకర్ల రమేశ్ సూచించారు. ఆర్డీవో ఆయిషా మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రోడ్డు విస్తరణ జరగాలని టీడీఆర్‌లు వద్దంటున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు విజయ్‌కుమార్, ఆది మహేశ్, ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్, అనకాపల్లి డీటీ వై.శ్రీరామ్మూర్తి, జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఏసీపీ వెంకటరావు, టౌన్ ప్లానింగ్ అధికారి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పరాయి పంచనే!

... 5వ పేజీ తరువాయి

నడపాలని ఉద్యోగులతోపాటు వివిధ పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వారు చేస్తున్న విజ్ఞప్తులను ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

మూడేళ్లయినా ఏర్పాటుకాని కేంద్ర కార్యాలయాలు

అనకాపల్లి జిల్లా ఏర్పడి మూడేళ్లు ముగిసినా.. కేంద్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఎన్‌హెచ్ఏఐ, జీఎస్టీ, కాలుష్య నియంత్రణ మండలి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్, తదితర శాఖల కార్యాలయాలు జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు నోచుకోలేదు. కొంతమంది అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. వీరు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరై తిరిగి విశాఖపట్నం వెళ్లిపోతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ ఏర్పాటు కోసం గత ఏడాది ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం శంకరం పంచాయతీ పరిధిలో పది ఎకరాలను గుర్తించింది. తరువాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ముందుకు కదలలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నది. జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌తోపాటు అన్ని శాఖల కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాల్సిన అవసరం వుందని ప్రజలు, ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

టీడీపీలో వర్గపోరు

... 5వ పేజీ తరువాయి

కార్యకర్తలు వాగ్వివాదానికి దిగారు. టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా, ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వున్న ఆయన ఫొటోను ఉద్దేశపూర్వకంగానే పెట్టలేదని ఎలిశెట్టి గణేశ్, సయ్యపురెడ్డి మాధవరావు, తలారి శంకర్, గురుమూర్తి, కోవెల వెంకటరమణ, తదితరులు ధ్వజమెత్తారు. దీంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారికి, తాతయ్యబాబు వర్గీయులకు మధ్య వాగ్వాదం మరింత ముదిరింది. ఎన్నికల ముందు టీడీపీ గెలుపు కోసం కష్టపడినవారిని కాకుండా అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారంటూ పరోక్షంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణను ఉద్దేశించి ఆరోపించారు. అనంతరం తాతయ్యబాబు వర్గీయులు సమావేశాన్ని బహిష్కరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దర్జాగా ఇసుక దోపిడీ

... 5వ పేజీ తరువాయి

నెల రోజుల క్రితం ఇసుక డిపోను ప్రారంభించింది. టన్నుకు రూ.1,100 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించి, ఇక్కడి నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చు. పెద్దమొత్తంలో ఇసుక నిల్వలు వున్నప్పటికీ రోజుకు పది టన్నుల ఇసుక కూడా అమ్ముడుపోవడంలేదు. సమీపంలోని నదులు, గెడ్డల్లో ఇసుక అక్రమ తవ్వకాలే ఇందుకు కారణమని స్థానికులు అంటున్నారు.

వికసించిన బుట్ట బొమ్మ!

» విశాఖ బయా డైవర్సిటీ పార్కులో అరుదైన పుష్పం



వికసించిన ఆర్కిడ్ జాతి పుష్పం బుట్ట బొమ్మ (చైనీస్ లాంతర్)

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బుట్ట బొమ్మలా కనిపించే ఈ అరుదైన పుష్పం విశాఖ నగరంలోని పెదవాల్తేరు బయో డైవర్సిటీ పార్కులో గురువారం వికసించింది. ఆర్కిడ్ జాతికి చెందిన ఈ మొక్క దక్షిణ బ్రెజిల్, అర్జెంటీనా, ఉరుగ్వేలలో కనిపిస్తుంది. ప్రపంచంలోని ప్రసిద్ధ బొటానికల్ పార్కుల్లో మాత్రమే ఈ మొక్కలు పెంచుతారు. ఆకట్టుకునే రంగులతో బుట్టబొమ్మను తలపించేలా ఉండే ఈ పువ్వును చైనీస్ లాంతర్‌గా కూడా పిలుస్తారని పార్కు నిర్వాహకుడు ఎం.రామమూర్తి తెలిపారు.

తల్లడిల్లిన కన్న పేగు

... 5వ పేజీ తరువాయి

మృతిచెందాడు. దీంతో గౌరి కన్నీరుమున్నీరు అయ్యింది. అప్పటి నుంచి రామును పదేపదే తలుచుకుంటూ కుమిలి పోతున్నది. కాగా గౌరి బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో కుమారుడు దుర్గారావు.. బంధువులకు ఫోన్ చేసి వాకబు చేశాడు. నర్సీపట్నం, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. గురువారం ఉదయం బలిఘట్టం ఉత్తరవాహిని (వరహా నది) వద్ద గాలిస్తుండగా సమీపంలో మహిళ మృతదేహం ఉందని స్థానికులు చెప్పారు. దీంతో అక్కడకు వెళ్లి చూడగా తల్లి విగతజీవిగా కనిపించింది. తన తమ్ముడు రాము మృతిని తట్టులేక తన తల్లి ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 20 రోజుల వ్యవధిలో తమ్ముడు, తల్లిని కోల్పోయానని దుర్గారావు ఆవేదన చెందాడు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి

కశింకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు గురువారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బయ్యవరం గ్రామానికి చెందిన పెదపాటి వెంకట్రావు(52) అనకాపల్లి మండలం సంపతిపురం పంచాయతీలో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపానికి వచ్చేసరికి ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఓ కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో వెంకట్రావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య

కొత్తూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోడూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన యల్లబిల్లి భారతి(21) తరచూ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. చాలా మంది వైద్యులకు చూపించినా సమస్య పరిష్కారం కాలేదు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరేసుకుంది. ఆ సమయంలో ఇంటికి వెళ్లిన ఆమె సోదరుడు యల్లబిల్లి సాయి, చిన్నాన్న కుమారుడు యల్లబిల్లి భీమరాజు వెంటనే చూసి ఆమెను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తమకు ఎవరిపైనా ఎటువంటి అనుమానమూ లేదని మృతురాలి తండ్రి యల్లబిల్లి అప్పారావు పోలీసులకు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భారతికి బుధవారం పెళ్లి చూపులు జరిగినట్టు తెలిసింది. ఇంతలో ఈ విధంగా జరగడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది.

బైక్ అదుపుతప్పి.. యువకుడి మృతి



కంకిపాటి బోడేశ్వరరావు (ఫైల్ ఫొటో)

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరపుపేట- కె.కొడిసింగి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి సీఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కె.కొడిసింగి గ్రామానికి చెందిన కంకిపాటి బోడేశ్వరరావు (32) బుధవారం సాయంత్రం వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంపై లక్కవరపుపేట వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి సుమారు 10 గంటల సమయంలో స్వగ్రామానికి బయలుదేరాడు. సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించిన తరువాత బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన తుప్పల్లోకి దూసుకుపోయింది. బోడేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. రాత్రి సమయం కావడంతో ఈ ప్రమాదాన్ని ఎవరూ గుర్తించలేదు. దీంతో అతను మృతిచెందాడు. గురువారం ఉదయం అటుగా వెళుతున్న వ్యక్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐతోపాటు పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. బోడేశ్వరరావుకు భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

అనంతగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టైడ-శివలింగపురం మధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వాలసీ పంచాయతీ కరకవలసకు చెందిన సప్పి సీతయ్య, జండేగి బాలరాజు సొంత పనుల మీద బైక్‌పై ఎస్.కోట వెళ్లారు. గురువారం సాయంత్రం తిరిగి సొంతూరు వెళుతుండగా ఘాట్‌రోడ్డులోని హెయిర్‌పిన్‌బెండ్-1 వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కొద్దిసేపటి తరువాత ఆ మార్గంలో వెళుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ఆగి, క్షతగాత్రులను 108 వాహనంలో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్. పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం జంక్షన్‌లోని ఒక ఇంటిలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో వున్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. చోద్యం జంక్షన్‌లో నివాసం వుంటున్న బొండల రాజు బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని లింగంపేటలో నూకాలమ్మ తీర్థానికి వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి తిరిగి రాగా.. తలుపులకు వేసిన తాళాలు పగలకొట్టి వున్నాయి. దీంతో ఆందోళన చెందిన ఆయన లోపలికి వెళ్లి బీరువాలో పరిశీలించగా ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి గురువారం ఉదయం కృష్ణాదేవిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తారకేశ్వరరావు సమాచారం అందజేయడంతో నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, క్లూస్ టీమ్‌తోపాటు ఎస్ఐ చోద్యం వచ్చారు. చోరీ జరిగిన ఇంటిలో వేలి ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలు సీజ్

రాంబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచదార్ల సమీపంలోని కొండ వద్ద గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలు, ఒక ద్విచక్ర వాహనాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారని రాంబిల్లి సర్కిల్ సీఐ నరసింగరావు తెలిపారు. బుధవారం రాత్రి పంచదార్ల సమీపంలోని కొండ వద్ద గ్రావెల్ తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడి చేసి ఆ లారీలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు ఆయన పేర్కొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న లారీలకు జరిమానా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిలో బుధవారం రాత్రి, గురువారం మధ్యాహ్నం అధిక రాయి లోడుతో వెళుతున్న లారీలను పట్టుకొని రవాణాశాఖ కార్యాలయానికి అప్పగించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. జాతీయ రహదారిలోని నూకాంబిక ముఖద్వారం వద్ద పట్టుకున్న లారీకి రూ.60 వేలు, పూడిమడక జంక్షన్‌లో పట్టుకున్న లారీకి రూ.62వేలు రవాణాశాఖ అధికారులు జరిమానా విధించారని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444